క్లుప్తంగా

నారసింహుని సేవలో పోలవరం ఎమ్మెల్యే



ఆలయంలో హారతి అందుకుంటున్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన మండలంలోని ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయాన్ని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన గర్భాలయంలోని నారసింహుడిని, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్ ఉన్నారు.

ఉమర్ ఆలీకి నివాళి



సంతాప సభలో మాట్లాడుతున్న ఎండీ అక్బర్ ఆలీ

జంగారెడ్డిగూడెం: ప్రముఖ సంఘ సేవకులు ఎండీ ఉమర్‌ఆలీ సంతాప సభ ఆదివారం నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలోని సాయి మాధవి టవర్స్ నందు నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ ముస్తఫా, చింతలపూడి లోక్ అదాలత్ మెంబర్, సంఘ సేవకులు ఎండీ అక్బర్ ఆలీ ఉమర్‌ఆలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలీ మాస్టారు తన సేవా కార్యక్రమాల ద్వారా ఎందరో పేదలను, రోగులకు ఆదుకున్నారని, ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఆలీ కుమారుడు ఎండీ అజగర్ ఆలీ, పేదలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పహారా



శ్రీరామవరంలో పహారా నిర్వహిస్తున్న దెందులూరు ఎస్సై కె.స్వామి, సిబ్బంది

దెందులూరు: ఏ గ్రామంలోనైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని దెందులూరు ఎస్సై కె.స్వామి ఆదివారం అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనానికి సహకరించాలని, పోలీస్ అధికారుల పర్యవేక్షణ అన్ని గ్రామాల్లో నిశితంగా ఉందన్నారు. మండలంలో శ్రీరామవరం, సోమవరప్పాడు, దెందులూరు, కొవ్వలి గ్రామాల్లో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాయుధ బలగాలతో పహారా, పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేశామన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచామన్నారు. ప్రతి ఒక్కరి స్వేచ్ఛ, జీవన విధానానికి ఏ ఇతర వ్యక్తి అవరోధం కలిగించరాదన్నారు.

జల్లేరు జలాశయంలో యువకుడు గల్లంతు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయంలో ఈతకు వెళ్లిన ఒక యువకుడు ఆదివారం గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొయ్యలగూడెం మండలం సరిపల్లికి చెందిన సాయికుమార్ అనే యువకుడు ఏడుగురు స్నేహితులతో కలిసి కామవరం సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మతల్లి దర్శనానికి వెళ్లారు. దర్శన అనంతరం తిరిగి జల్లేరు జలాశయం వద్దకు చేరుకుని అక్కడ ఈత కొట్టేందుకు వారు జలాశయంలో దిగారని, ఆ సమయంలో సాయికుమార్ గల్లంతైనట్లు తెలిపారు. గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదని, రాత్రి సమయం కావడంతో సోమవారం గాలింపు చర్యలను కొనసాగిస్తామని స్థానికులు తెలిపారు.

వైభవంగా గంగానమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు



పూజలు నిర్వహించిన కమిటీ సభ్యులు

దెందులూరు: స్థానిక గౌడవీధిలోని గంగానమ్మ తల్లి 9వ ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో ఆలంకరణ, పూజలు, ప్రదక్షిణలు చేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ ఆవరణలో మహా అన్నదానం నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ పూర్తి సౌకర్యాలు కల్పించారు.

నాట్యంలో ప్రతిభా కుసుమం

- ఐదో తరగతి నుంచే నాట్యకళపై మంజు ఆశ సత్యశ్రీ ఆసక్తి
- బీటెక్ చదువుతూ ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో నృత్య ప్రదర్శనలు



మంజు ఆశ సత్యశ్రీకి జ్ఞాపికను అందజేసి సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: భరతనాట్యం, కూచిపూడి నాట్యంలో ప్రతిభ కనబరుస్తూ పురస్కారాలు, సత్కారాలను అందుకుంటోంది జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామానికి చెందిన అయినవల్లి మంజు ఆశ సత్యశ్రీ. అయినవల్లి త్రిమూర్తులు, కుమారి దంపతుల కుమార్తె మంజు ఆశ సత్యశ్రీకి భరత నాట్యం, కూచిపూడి కళలపై ఆసక్తి ఉండటంతో ఒక పక్క చదువుతో పాటు నాట్యంపై శ్రద్ధ కనబరుస్తూ నాట్య మయూరిగా రాణిస్తోంది. ప్రస్తుతం బీటెక్ చదువుతున్న మంజు ఆశ సత్యశ్రీ 5వ తరగతి చదువుతున్నప్పటి నుంచే కళలపై ఎంతో ఆసక్తి పెంచుకుంది. అనేక కళారంగ వేదికలపై, అనేక పుణ్యక్షేత్రాల్లో ప్రదర్శనలిచ్చి తన ప్రతిభను చాటింది. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన చిన్న తిరుపతి, అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం, గురవాయిగూడెం మద్దిక్షేత్రం, సింహాచలం, అప్పన్నపల్లి, నిడదవోలు కోట సత్తెమ్మ, పట్టిసీమ వీరేశ్వరస్వామి క్షేత్రం, కర్ణాటక మైసూర్ ప్యాలెస్‌లలో మంజు ఆశ సత్యశ్రీకి తన నృత్య ప్రదర్శనలతో అలరించింది. దుబాయ్‌లో కూడా తన ప్రదర్శనతో ప్రశంసలు పొందడంతో పాటు అనేక అవార్డులను, సత్కారాలను అందుకుంది. మైసూర్ ప్యాలెస్‌లో ఏకధాటిగా 6 గంటల నృత్యప్రదర్శన చేసి మంజు ఆశ సత్యశ్రీ గుర్తింపు తెచ్చుకుంది.



కూచిపూడి నృత్య ప్రదర్శనలో మంజు ఆశ సత్యశ్రీ

తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే..



కూచిపూడి, భరత నాట్యంలో మరిన్ని ప్రదర్శనలు ఇచ్చి మంచి కళాకారిణిగా గుర్తింపు తెచ్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. నా తల్లిదండ్రులు త్రిమూర్తులు, కుమారి నన్ను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. నా ప్రతిభకు మెచ్చి పురస్కారాలు, సత్కారాలు అందుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది.

– అయినవల్లి మంజు ఆశ సత్యశ్రీ, గురవాయిగూడెం

కరెంటుతో జాగ్రత్త..!

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు, మోటర్లతో భద్రం
- చిన్న నిర్లక్ష్యం.. ప్రాణాలకే ప్రమాదం
- పొలం పనులకు వెళ్లే రైతన్నలు జాగ్రత్తగా ఉండాలని సూచన



రైతు పొలంలో బిగించిన మోటరు వినియోగిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: రుతుపవనాలతో తొలకరి జల్లులు కురవడం, మృగశిర కార్తె కూడా ప్రారంభం కావడంతో రైతులు పొలంబాట పట్టారు. అనేక మంది ఇప్పటికే పొలాలను బాగు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇకపై విత్తనం నాటిన నాటి నుంచి పంట ఇంటికి చేరే వరకూ పొలంలోనే గడుపుతూ ఉంటారు. అలాగే పంట నీటి కోసం తెల్లవారితే చాలు విద్యుత్ తీగలు, విద్యుత్ మోటర్ల వద్ద ఎక్కువగా పనిచేస్తుంటారు. చాలా మంది రైతులు చిన్నచిన్న విద్యుత్ మరమ్మతులను స్వయంగా వారే చేస్తుంటారు. ఈ క్రమంలో జాగ్రత్తలు తీసుకోకపోతే మృత్యువాతన పడే అవకాశం ఉంది. పొలాల్లో కర్ర స్తంభాలు, వేలాడుతున్న తీగల విషయంలో ఏకొద్దిపాటి నిర్లక్ష్యం వహించినా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

కవర్లు లేని మోటర్లతో...

రైతులు తక్కువ ధరలకు మోటర్లను వాడుతుంటారు. చాలా మంది రైతులు మోటర్లు ఆరుబయట బావి ఒడ్డు, కాల్వ ఒడ్డున ఉంచి చిన్న కవర్‌ను కప్పుతారు. అవి కొన్నిరోజులకే దెబ్బతింటాయి. అనంతరం వాటిని పట్టించుకోకపోవడంతో మోటర్లతో ప్రమాదం పొంచి ఉంటుంది. సింగిల్ ఫేజ్ తీగ కాలికి తగిలితే మోటరు మొత్తానికి విద్యుత్ ప్రవహిస్తుంది. దానిని తాకగానే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో తగు జాగ్రత్తలు చేపడితే ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు చెప్తున్నారు.

ఇనుప డబ్బాలతో ప్రమాదకరం

చాలా మంది రైతులు ఇప్పటికీ స్టార్టర్ల కోసం ఇనుప డబ్బాలను ఉపయోగిస్తారు. ఇనుప డబ్బాల్లో స్టార్టర్లు, ఫీజులు బిగించడంతో ఎలుకలు డబ్బాల్లోకి వెళ్లి తీగలు కొరకడంతో ఆ తీగలు తెగి డబ్బాకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇది తెలియక రైతులు డబ్బాను పట్టుకునే ప్రయత్నం చేయగానే విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

తెగిన తీగలు ప్రమాదం

గాలి, వానలకు ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడుతూ ఉంటాయి. ఆ సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అలాగే వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే పొలంలో నుంచి విద్యుత్ తీగలను తీసుకువచ్చి ఇళ్లలో కట్టకట్టి దాస్తుంటారు. ఆ సమయంలో ఎలుకలు కొరికే అవకాశం ఉంటుంది. రైతులు తీగలను ప్రారంభ సమయంలో తప్పనిసరిగా పరీక్షించాలి. అనంతరం మోటర్లకు తీగలను అమర్చుకోవాలి. పాత తీగల కంటే కొత్త తీగలను అమర్చుకోవడం మంచిది. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న ప్రదేశాల్లో కొందరు రైతులు మధ్యమధ్యలో తాత్కాలికంగా కర్రలు వేసుకుని వాటికి తీగలు అమర్చుకుంటారు. ఇవి వర్షం, గాలులకు కిందపడి ఉంటాయి. వాటిని గమనించకుండా పొలాల్లో పనిచేసుకుంటే అవి కాలికి తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. స్తంభాలు దూరంగా ఉంటే విద్యుత్ సిబ్బందితో మాట్లాడి విద్యుత్ స్తంభాలు వేసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి ఇలా

- పొలాల్లో మోటర్లు పనిచేయకపోతే చేతితో పట్టుకోకూడదు. టెస్టర్ సహకారంతో మాత్రమే పరీక్షించాలి.
- వర్షం నీరు, తేమ తగలని చోట వాటిని అమర్చి రక్షణగా కవర్ కప్పాలి.
- ఎర్తింగ్ తప్పనిసరిగా ఉంచుకోవాలి.
- మోటర్‌కు ఏదైనా మరమ్మతులు చేయాలంటే ముందుగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



విద్యుత్ తీగలు, మోటర్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పనులు ప్రారంభించే ముందు మోటర్లకు అమర్చే వైర్లు తప్పనిసరిగా పరీక్షించుకోవాలి. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు.

– పి.రాధాకృష్ణ, ఏఈ ఈడీసీ ఈఈ, జంగారెడ్డిగూడెం

స్టార్టర్‌ల వినియోగంలో...

స్టార్టర్ డబ్బాలను మోటర్ పక్కనే పొలంలో ఉంచి రైతులు కవర్‌లు కప్పుతూ ఉంటారు. ఇది ప్రమాదకరమని విద్యుత్‌శాఖ అధికారులు చెప్తున్నారు. డబ్బాలకు ఉన్న తలుపుల గురించి పట్టించుకోరు. తద్వారా నీరు అందులోకి చేరుతుంది. తీగలు కూడా గజిబిజిగా ఉండేలా తెంపి మళ్లీ అతికిస్తారు. ఏ తీగ ఏ ఫీజుదో కూడా తెలియకుండా ఉంటుంది. వీటి పట్ల కూడా కచ్చితమైన జాగ్రత్తలు పాటించాలని అధికారులు చెప్తున్నారు.

స్టార్టర్‌లతో జాగ్రత్తలు ఇలా

- స్టార్టర్‌లను పోడు ప్రదేశంలో మోటరుకు దగ్గరగా అమర్చుకోవాలి.
- రక్షణ కవర్‌లను తీసివేయరాదు.
- నేరుగా స్టార్టర్‌లకు విద్యుత్ సరఫరా అయ్యేలా ఫీజు తప్పకుండా అమర్చుకోవాలి.
- సొంత మరమ్మతులు చేయడం మంచిదికాదు.
- స్టార్టర్ డబ్బాలకు తలుపులు తప్పనిసరిగా ఉండాలి.

పారిజాతగిరి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రాజీనామా

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ గూడపాటి రాధాకృష్ణ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన దేవదాయ శాఖ కమిషనర్‌కు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

అతిరాస కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా



రాజీనామా చేసిన ఇళ్ల భాస్కరరావు

కొయ్యలగూడెం: అతిరాస కార్పొరేషన్ చైర్మన్ పదవికి ఇళ్ల భాస్కరరావు రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని బీసీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి తన రాజీనామా లేఖను అందజేశారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ తాను రాజీనామా చేసినట్లు చెప్పారు.

పేకాటపై దాడి

జంగారెడ్డిగూడెం: పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని తాడువాయి శివారులో సిబ్బందితో కలిసి దాడి చేశామని, ఈ దాడిలో 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.9,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు.

సకల కళాకారుల సంఘం కమిటీ ఎన్నిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సకల కళాకారుల సంక్షేమ సంఘం ఏలూరు మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో శ్రీహరికోటి అధ్యక్షతన మండల సర్వజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు మండల కమిటీ అధ్యక్షుడిగా శ్రీహరి కోటి, కార్యదర్శిగా కాసా సాంబశివరావు, కోశాధికారిగా నీలి శర్వాణి ఎన్నికయ్యారు. వీరితో పాటు వివిధ కళారంగాలకు చెందిన పలువురు వ్యక్తులను సంఘ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దువ్వి రామారావు, బళ్ళ శ్రీనివాస్, కోశాధికారి డీ హేమ సుందర్ మాట్లాడుతూ తమ సంఘం పేద కళాకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పేద వృద్ధ కళాకారులను సంఘం తరపున ఆదుకుంటామని స్పష్టం చేశారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ఉత్సవాలు ప్రారంభం



వేణుగోపాలస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: మండలంలోని యర్రగుంటపల్లి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగ ప్రారంభం అయ్యాయి. ఉదయం 6 గంటలకు తోరణం కట్టి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన చేశారు. అనంతరం హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పుష్పార్చన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చంద్రగిరి శేషకిరణ్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన పురోహితులు కోమాండూరి అనంత వెంకట శ్రీకర్, తాతపూడి శ్రీ వివేక్, చంద్రడిరి బాల భాస్కర్, ఆలయ అర్చకులు తడికలపూడి రామకృష్ణ శర్మ మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మూడురోజులపాటు ఉత్సవాలు నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

చింతలపూడి: చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు బీఎస్సీ హానర్స్ (ఫిజిక్స్), బీఎస్సీ హానర్స్ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ హానర్స్ (కెమిస్ట్రీ), బీఎస్సీ.హానర్స్ (బోటనీ), బీఏ ఒకేషనల్ హానర్స్ (హార్టికల్చర్), బీఏ హానర్స్ (హిస్టరీ), బీకాం హానర్స్ (కంప్యూటర్ అప్లికేషన్) కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 18 నుంచి ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. మూడు సంవత్సరాలు డిగ్రీ పూర్తయిన విద్యార్థులు కళాశాలలో 4వ సంవత్సరం కెమిస్ట్రీ సబ్జెక్టును పూర్తి చేసుకునే అవకాశం కల్పించామన్నారు. కళాశాలలో డిగ్రీ చదివే విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. గత నెలలో తమ కళాశాల నుంచి 58 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు.

పర్యావరణం, చిన్నారుల కేన్సర్‌పై ప్రత్యేక దృష్టి



లయన్స్ జిల్లా మినీ డైరెక్టరీని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రపంచాన్ని నేడు పట్టి పీడిస్తున్న ఆకలి, పర్యావరణ కాలుష్యం, చిన్నపిల్లల క్యాన్సర్, కంటి చూపు, మధుమేహం, తరిగిపోతున్న మానవత్వ విలువలు తదితర సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించాలని కాకరాల వేణుబాబు సూచించారు. స్థానిక గ్రీన్‌సిటీలోని లయన్స్ జిల్లా భవనంలో ఆదివారం లయన్స్ జిల్లా ప్రీ క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. వచ్చే జులై నెల నుంచి లయన్స్ జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న కాకరాల వేణుబాబు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ చేపట్టాల్సిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. హానరరీ కమిటీ చైర్‌పర్సన్ గట్టిం మాణిక్యాలరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం అంతా సేవలందించిన సేవాతత్పరులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 25 తేదీలలో ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో జరిగే అంతర్జాతీయ కన్వెన్షన్‌లో ప్రపంచ లయన్స్ అధ్యక్షుల చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఆస్ట్రేలియా బయలుదేరుతున్న గవర్నర్ దంపతులు కాకరాల వేణుబాబు, వెంకటరత్నంలకు విదేశీయాన శుభాకాంక్షలు తెలియజేసే కార్యక్రమాన్ని నిర్వహించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా లయన్స్ జిల్లా మినీ డైరెక్టరీని అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ వంకా రవీంద్రనాథ్, జిల్లా ప్రథమ వైస్ గవర్నర్‌గా ఎన్నికైన ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు, జిల్లా ద్వితీయ వైస్ గవర్నర్‌గా ఎన్నికైన డీ సుబ్బారావు, జిల్లా పూర్వ గవర్నర్లు పీ సుభాష్ బాబు, వీకే పంకజాక్షన్, వేమా కోటేశ్వరరావు, పీ విజయ భాస్కరరెడ్డి, చినమిల్లి సత్యనారాయణ, దామెర రంగారావు, ఈపూరి సత్యనారాయణ, గాట్ వైస్ చైర్మన్ వీ సత్యస్వరూప్, జిల్లా క్యాబినెట్ కార్యదర్శులు వీ రమేష్ దత్, ఎం.శ్రీహరి, చీఫ్ ఎడిటర్ వీవీ స్వామి, జిల్లా నాయకులు ఎల్ వెంకటేశ్వరరావు, సీహెచ్ రామమోహనరావు, కొరిపల్లి సత్యనారాయణ, వీ విష్ణు కుమార్, గ్లోబల్ యాక్షన్ టీం సభ్యులు, రీజియన్ – జోన్ చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ సంబరాలు

జంగారెడ్డిగూడెం: నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు నిర్వహించారు. ముందుగా గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో గంగానమ్మ గుడి సెంటర్లో బీజేపీ కార్యకర్తలు నాయకులు మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు.

సీనియర్ నాయకులు అర్జుల మురళీకృష్ణ, మల్లాది సీతారామారావు, కొండపల్లి కేసుబాబు, జిల్లా ఉపాధ్యక్షులు పీసుపాటి రామలక్ష్మి, వేమూరి శ్రీనివాసు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు గంటా అనురాధ, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు జొన్నాదుల స్వరాజ్యలక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు



జంగారెడ్డిగూడెం గంగానమ్మ గుడి వద్ద బీజేపీ నాయకులు మిఠాయిలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కుక్కునూరులో ర్యాలీ

కుక్కునూరు: దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం బీజేపీ, జనసేన నాయకులు కుక్కునూరు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. డీజే నృత్యాలతో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తానని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదివారం ఆయన్ను క్యాంపు కార్యాలయంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న సందర్భంగా మున్సిపల్ వర్కర్లకు మంచే జరుగుతుందని, మీరు తొందరపడి ఎటువంటి ఆందోళనలు చేయవద్దని కోరారు. చంటిని కలిసి అభినందించిన వారిలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు, ఏలూరు నగరపాలక సంస్థ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దొడ్డిగర్ల నాగబాబు, యలగాడ శివకుమార్, ఇంటి అశోక్, అంతరాజు లీలా ప్రసాద్, గంట జానకిరామ్, డీ రవీంద్ర, కిలారి వెంకన్నబాబు, మాదుగుల జగదీష్ తదితరులు ఉన్నారు.

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు చేస్తున్న నిరాహార దీక్షలు ఆదివారం కొనసాగించారు. లాభాల్లో ఉన్న కంపెనీని అన్యాయంగా మూసివేసి తమకు తీరని అన్యాయం చేసిందని, కంపెనీ పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ కంపెనీ ఉద్యోగులు మూడు రోజులుగా కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. కంపెనీ గేటు వద్ద వారంతా నినాదాలు చేస్తూ తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తున్నారు. తమను ఉద్యోగాల్లోకి తీసుకున్న సమయంలో ఉద్యోగభద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని యాజమాన్యం విస్మరించి ఉద్యోగులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని వారు నినాదాలు చేశారు.